''నెలరోజులుగా నీ ప్రత్యేక ప్రవర్తనకు కారణం నేను కనిపెట్టి అదే విషయాన్ని మీ డాడీ ముందుం చాను. స్వప్నా! తండ్రిగా ఆయన కర్తవ్యం ఆయన నిర్వర్తించారు. ఆయన బాధ్యతను ఆయన చేపట్టి విషయమంతా మూడురోజులలో తెలుసుకోగలి గారు'' అంది రాజేశ్వరి.

ఇంతలో ఆఫీసు నుండి స్వప్న తండ్రి విశ్వనాథ్ వచ్చాడు.

''ఏమిటి మమ్మీ డాడీ తెలుసుకున్న విషయమే మిటీ?'' అంది స్వప్న.

''నువ్వు కిరణ్‌ని రోజూ పార్కులో కలుసుకుం టున్న విషయం మీ డాడీకి చెప్పగానే మీ డాడీ ఆ కిరణ్‌ను గురించి ఎంక్వయిరీ చేసారు. అతను ఎప్పుడూ బార్‌ల చుట్టూ తిరుగుతూ పూర్తిగా తాగుడుకు బానిస అయినట్లు, కేవలం డబ్బుకు ప్రాధాన్య మిస్తూ పెద్దకట్నం ఇచ్చే అమ్మాయితో వివాహానికి ఒప్పుకున్నట్లు తేలింది. మరో రెండు రోజులలో అతని పెళ్లి జరగబోతున్నట్లు తెలి సింది. మీ డాడీ నాకు ఈ విషయమంతా సేకరించి చెప్పారు'' అంది రాజేశ్వరి.

స్వప్న నమ్మలేనట్లుగా తండ్రి వైపు చూసింది.

విశ్వనాథ్ తన జేబులోని వెడ్డింగ్ కార్డ్ తీసి స్వప్న చేతికిచ్చాడు. స్వప్న ఆశ్చర్యంగా దానిని అందుకుంది.

''స్వప్నా ఆ వెడ్డింగ్ కార్డ్ కిరణ్‌ది. అతను పచ్చి మోసగాడు. ఎల్లుండి అతని పెళ్లి. కష్టపడి వెడ్డింగ్ కార్డ్ కూడా సేకరించగలిగాను'' అన్నాడు విశ్వ నాథ్.

విశ్వనాథ్ మాటలకు స్వప్న కళ్లు చెమర్చాయి.

''మమ్మీ! మీరు నాకు జన్మ నివ్వడమే కాకుండా జీవితం నరకంలో పడకుండా కాపా డారు. లేకుంటే ఆ కిరణ్ పెళ్లి చేసుకొని వారంరో జుల తర్వాత నా దగ్గరకు వచ్చి నన్ను కూడా మోసం చేసేవాడు. ఆ ప్రమాదం నుండి నన్ను తప్పించారు. మీరు నేటి తల్లిదండ్రులు.''

**-జి.మేరీ కృపాబాయి**(మచిలీపట్నం)

# పోస్ట్‌మాన్ రామయ్య

ఆ గ్రామానికి పోస్ట్‌మాన్ రామయ్య. అతనిని పోస్ట్‌మాన్ అని అనేకంటే గ్రామ శ్రేయోభిలాషి, గ్రామ బంధువు లేదా గ్రామ అతిథి అంటే అతనికి తగినట్లుగా వుంటుంది. అతనంటే గ్రామం లోని పిల్లలకు, పెద్దలకు, యువతీ యువకులకు అందరికీ ఇష్టమే. దీనికి కారణం అతని ముఖంలో చెరగని చిరునవ్వు, ఓర్పు, శాంతం కనపడేవి. చదువు రాని వాళ్లకి వాళ్ల కోరిక మేరకు వాళ్లకి వచ్చిన ఉత్తరాలు చదివి విని పించేవాడు. వాళ్లు కోరినట్లు ఉత్త రాలు రాసిపెట్టేవాడు. టెలిగ్రాములు వచ్చిన వాళ్లకి ఇంగ్లీషు తెలియకపోతే వాళ్లకి వాటి అర్థాన్ని తెలుగులోకి తర్జుమా చేసి చెప్పేవాడు. వీటన్నిం టిని మించి గ్రామంలో ఎవరైనా తమ స్వంత సమస్యలకి పరిష్కారాన్ని చూపమని అడిగితే, అతను దానికి పరిష్కారం తగినట్లుగా చూపే వాడు.

రామయ్య బ్రాంచి ఆఫీసునుంచి పదిమైళ్లు సైకిలు తొక్కి తపాలా సంచితో ఆ గ్రామం చేరుకు నేవాడు. ముందుగా ఆ గ్రామ మునసబు శేషయ్య ఇంటికి వెళ్లి అక్కడ చల్లని మజ్జిగ తాగేవాడు. కొంచెం సేపు శేషయ్యతో గ్రామంలో విశేషాలను గురించి మాట్లాడుతూ విశ్రాంతి తీసుకుని సైకిలు తొక్కిన అలసటను వదల్చుకుని, మిగిలిన ఇళ్లలో ఉత్తరాలు వగైరా ఇవ్వడానికి బయలుదేరేవాడు.



ఏదైనా పండుగ వచ్చిందంటే రామయ్యకు ఆరో జున పిండివంటలతో భోజనం శేషయ్య ఇంట్లోనే ఏర్పాటయ్యేది. శేషయ్య, రామయ్యలో ఒక ఆప్త మిత్రుడిని చూసుకునేవాడు.

శేషయ్యకు ఒక్కగానొక్క కూతురు. కొడు కులు లేరు. పెళ్లీడుకు వచ్చిన ఆమెకు ఒక మంచి పట్నం సంబంధం కుదిరింది. పెళ్లికి ముహూర్తం పెట్టారు. పెళ్లి శుభలేఖ అందరితో పాటుగా రామయ్య కూడా అందుకున్నాడు. పెళ్లి యథావి ధిగా జరిగింది. పెళ్లి సందడి అంతా ముగిసిన వారం రోజుల తరువాత రామయ్య ఒక టెలిగ్రాంను శేషయ్య కందించాడు. అసలా టెలిగ్రాం పెళ్లి రోజున ముహూర్తానికి ముందుగా అందవల్సింది. కానీ రామయ్య ఆ టెలిగ్రాంను శేషయ్యకు అప్పుడే ఇవ్వలేదు. శేషయ్యకు దగ్గర బంధువు ఒకాయన చనిపోయాడని ఆ టెలిగ్రాంలో వుంది. ఆ చెడు వార్త శేషయ్యకు తన కూతురు పెళ్లి ముహూర్తానికి ముందుగానే తెలిస్తే పెళ్లి ఆగిపోతుందని, పెద్ద ఖర్చుతో చేసిన ఏర్పాట్లన్నీ దండగ అవుతాయని, అందరూ బాధపడతారని ఆలోచించి రామయ్య ఆ టెలిగ్రాం వారం రోజులు ఆలస్యంగా శేషయ్యకి చ్చాడు. శేషయ్య తన దగ్గర బంధువు మరణానికి బాధపడినప్పటికీ, తన కూతురు పెళ్లి ఏ ఆటంకం లేకుండా జరగటానికి సహాయపడిన రామయ్యను మనసారా అభినందించాడు.. తనకు టెలిగ్రాంను ఆలస్యంగా ఇచ్చినందుకు శేషయ్య పోస్టు అధికారు లకు రామయ్యపైన ఫిర్యాదు చెయ్యని కారణంగా కర్తవ్య నిర్వహణలో రామయ్య చేసిన తప్పు బయట పడలేదు.

**-కూచిభొట్ల శ్రీనివాసశాస్త్రి**
(హైదరాబాద్)